# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 08-05-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ప్రపంచ ఉగ్రవాదానికి కేంద్రంగా పాకిస్తాన్ పేరు పొందిందని భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి అన్నారు.
- "ఆపరేషన్ సిందూర్"లో కనీసం 100 మంది ఉగ్రవాదులు హతమైనట్లు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు.
- భారతదేశం ప్రపంచంలోనే 3వ అతిపెద్ద వాహన తయారీదారు అని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు.
- రైతుల కోసం ఈనెల 29 నుండి దేశవ్యాప్తంగా "వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్" ప్రచార కార్యక్రమం ప్రారంభిస్తున్నామని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రకటించారు.
- పాకిస్తాన్ మూలాలు కలిగిన వెబ్-సిరీస్, సినిమాలు, ఇతర కంటెంట్‌లను తక్షణమే నిలిపివేయాలని OTT, ప్రసార మాధ్యమ వేదికలకు భారత ప్రభుత్వం సూచించింది.

=====================

ప్రపంచ ఉగ్రవాదానికి కేంద్రంగా పాకిస్తాన్ పేరు ప్రపంచ వ్యాప్తంగా జరిగిన వివిధ ఉగ్రవాద దాడుల వల్ల వచ్చిందని భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి అన్నారు. ఈ రోజు న్యూఢిల్లీలో పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పహల్గామ్ ఉగ్ర దాడిపై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో చర్చలు జరుగుతున్నప్పుడు, ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (TRF) పాత్రను పాకిస్తాన్ వ్యతిరేకించిందని, దాడికి TRF రెండుసార్లు బాధ్యత వహించిన తర్వాత ఇది జరిగిందని వివరించారు. ఐక్యరాజ్యసమితి జాబితాలో ఉన్న లష్కే ఇ తోయిబా, జైష్ ఇ మహ్మద్ వంటి ఉగ్రవాద గ్రూపులకు పాకిస్తాన్ నిలయమని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 33 సెకన్లు)

=====================

ఆపరేషన్ సిందూర'లో కనీసం 100 మంది ఉగ్రవాదులు హతమైనట్లు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. 'ఆపరేషన్ సిందూర్' గురించి వివరించేందుకు కేంద్రం ప్రభుత్వం ఈ రోజు అఖిలపక్ష సమావేశం నిర్వహించింది. ఈ మేరకు ఆపరేషన్ వివరాలను ఆయన అఖిలపక్షానికి తెలియజేశారు. తొమ్మిది ఉగ్ర స్థావరాలపై అత్యంత కచ్చితత్వంతో దాడులు నిర్వహించామని తెలిపారు. ఈ ఉద్రిక్తతలను పెంచాలన్న ఉద్దేశం ప్రభుత్వానికి లేదని, అయితే పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు పాల్పడితే 'ఆపరేషన్ సిందూర్' కొనసాగుతుందని వెల్లడించారు. అదే విధంగా న్యూఢిల్లీలో జరిగిన నేషనల్ క్వాలిటీ కాన్‌క్లేవ్‌లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాల్గొని ప్రసంగించారు. దేశ సాయుధ దళాలు ప్రదర్శించిన  పరాక్రమానికి కేంద్రమంత్రి అభినందనలు తెలియజేస్తూ...

(వాయిస్ 35 సెకన్లు)

=====================

భారతదేశం ప్రపంచంలోనే 3వ అతిపెద్ద వాహన తయారీదారు అని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన 4వ అంతర్జాతీయ BBB సమ్మిట్ బయోఎనర్జీ వాల్యూ చైన్ ఎక్స్‌పోలో ప్రసంగిస్తూ... కేంద్రమంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. దేశ ఆటోమొబైల్ పరిశ్రమ నిరంతరం పెరుగుతోందని ఆయన అన్నారు. వివిధ రకాల ఆటోమొబైల్స్‌కు డిమాండ్ పెరుగుతోందని, అదే సమయంలో ఆటోమొబైల్ ఉత్పత్తిలో పెరుగుదల కారణంగా శిలాజ ఇంధన వినియోగం కూడా పెరుగుతుందని అన్నారు. దిగుమతులను తగ్గించి ఎగుమతులను పెంచాల్సిన అవసరాన్ని నితిన్ గడ్కరీ గుర్తు చేశారు.

=====================

భారతదేశం వేల సంవత్సరాలుగా ప్రజాస్వామ్య స్ఫూర్తితో నిండిన దేశంగా ఉందని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ అన్నారు. ఈ రోజు న్యూఢిల్లీలో  ఉపరాష్ట్రపతి - ఎన్‌క్లేవ్‌లో ఇండియా ఫౌండేషన్ నుండి కౌటిల్య ఫెలోస్ ప్రోగ్రామ్‌లో పాల్గొన్న వారితో ఆయన సంభాషించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశ ఎన్నికల ప్రక్రియ అద్భుతమన్నారు. గొప్ప మార్పును విశ్వసించిన దార్శనికుడిగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీని ప్రశంసించారు.

=====================

జాతీయ భద్రతకు సంబంధించిన ఇటీవలి పరిణామాల నేపథ్యంలో జాతీయ సంసిద్ధత, అంతర్-మంత్రిత్వ సమన్వయాన్ని సమీక్షించడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈరోజు ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, విభాగాల కార్యదర్శులతో ఉన్నత స్థాయి సమావేశానికి అధ్యక్షత వహించారు. ప్రస్తుత పరిస్థితిని ఎదుర్కోవడానికి మంత్రిత్వ శాఖల ప్రణాళిక, సన్నద్ధతను ఆయన సమీక్షించారు. పౌర, రక్షణ యంత్రాంగాలను బలోపేతం చేయడం, తప్పుడు సమాచారం, అసంపూర్ణ వార్తలను ఎదుర్కోవడానికి ప్రయత్నాలు, కీలకమైన మౌలిక సదుపాయాల భద్రతను నిర్ధారించడం వంటి వాటిపై చర్చించారు. రాష్ట్ర అధికారులు, క్షేత్రస్థాయి సంస్థలతో సన్నిహిత సమన్వయాన్ని కొనసాగించాలని మంత్రిత్వ శాఖలకు ప్రధానమంత్రి సూచించారు.

విరామం

=====================

ఆధునిక సాంకేతికత, కొత్త విత్తన రకాల గురించి రైతుల్లో అవగాహన కల్పించడానికి ఈనెల 29 నుండి జూన్ 12వ తేదీ వరకు దేశవ్యాప్తంగా "వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్" ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించనున్నామని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రకటించారు. ఈ రోజు న్యూఢిల్లీలో జరిగిన జాతీయ వ్యవసాయ సదస్సు-ఖరీఫ్ ప్రచారం 2025 కార్యక్రమంలో ఆయన  ప్రసంగించారు. దేశవ్యాప్తంగా 700 జిల్లాలలో ఈ ప్రచారం జరుగుతుందని, దాదాపు ఒక కోటి 50 లక్షల మంది రైతులను చేరుకుంటుందని కేంద్రమంత్రి తెలియజేశారు. కేంద్ర, రాష్ట్రాలతో కలిసి వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు, ప్రగతిశీల రైతులతో సహా 2 వేల బృందాలను ఏర్పాటు

చేయడం జరుగుతుందని అన్నారు. ప్రతి బృందం జిల్లా స్థాయిలో ప్రతిరోజు 3 సమావేశాలను నిర్వహిస్తుందని, ప్రతిరోజు 10 నుండి 12 లక్షల మంది రైతులను చేరుకోవడమే లక్ష్యమని శివరాజ్ సింగ్ చౌహాన్ స్పష్టం చేశారు.

=====================

పాకిస్తాన్‌తో పరిస్థితిని మరింత తీవ్రతరం చేయడం తమ ఉద్దేశ్యం కాదని, సైనిక దాడులు జరిగితే, దానికి చాలా దృఢమైన ప్రతిస్పందన ఉంటుందని విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ అన్నారు. న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన భారత్-ఇరాన్ 20వ జాయింట్ కమిషన్ సమావేశానికి ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరఘ్చితో కలిసి జై శంకర్ అధ్యక్షత వహించారు. పహల్గామ్ దాడి కారణంగా సరిహద్దు ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై దాడి చేయడం ద్వారా భారతదేశం స్పందించాల్సి వచ్చిందని జైశంకర్ వివరిస్తూ...

(వాయిస్ 34 సెకన్లు)

=====================

పాకిస్తాన్ మూలాలు కలిగిన వెబ్-సిరీస్, సినిమాలు ఇతర కంటెంట్‌లను తక్షణమే నిలిపివేయాలని భారత ప్రభుత్వం OTT ప్రసార మాధ్యమ వేదికలతో పాటు భారతదేశంలో పని చేస్తున్న మధ్యవర్తులను కోరింది. పహల్గామ్ ఉగ్రవాద దాడి, జాతీయ భద్రత దృష్ట్యా కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఈరోజు వారికి ఒక సలహా జారీ చేసింది. సబ్‌స్క్రిప్షన్ ఆధారిత విధానంలో, మరే ఇతర విధానంలో అందుబాటులో ఉంచినటువంటి పాకిస్తానీ వెబ్-సిరీస్, సినిమాలు, పాటలు, పాడ్‌కాస్ట్‌లు, ఇతర స్ట్రీమింగ్ మీడియా కంటెంట్‌ను ప్రసారం చేయడాన్ని నిలిపివేయాలని మంత్రిత్వ శాఖ వారికి సూచించింది.

=====================

ఉత్తరాఖండ్ లో ఈ రోజు ఉదయం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఉత్తరకాశి జిల్లాలోని గంగ్నాని సమీపంలో ఒక హెలికాప్టర్ కూలిపోవడంతో ఆరుగురు యాత్రికులు మరణించగా, ఒకరు గాయపడ్డారు. డెహ్రాడూన్‌లోని సహస్త్రధార హెలిప్యాడ్ నుండి ఖర్సాలి హెలిప్యాడ్‌కు ప్రైవేట్ కంపెనీకి చెందిన హెలికాప్టర్ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పైలట్‌తో సహా మొత్తం ఏడుగురు వ్యక్తులు హెలికాప్టర్‌లో ఉన్నారు. వారిలో ఐదుగురు మృతి చెందగా.. ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి ప్రమాదంపై విచారం వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై విచారణకు ఆదేశించారు.

=====================

తెలంగాణ రాష్ట్రంలోని ములుగు జిల్లాలో ఈ రోజు ఉదయం మావోయిస్టులు జరిపిన ల్యాండ్‌మైన్ పేలుడులో ముగ్గురు జూనియర్ గ్రేహౌండ్స్ కమాండోలు మరణించారు.

=====================
=====================